






# సకల సౌభాగ్యనగరి

భాగ్యనగరం సకల వసతులతో అలరారుతున్నది. గ్రేటర్ అభివృద్ధిలో పరుగులు పెడుతున్నది. ప్రతి రంగం గణనీయమైన ప్రగతిని నమోదు చేస్తున్నది. పేదలు, సామాన్యులను అక్కున చేర్చుకుని వారికి అవసరమైన వసతులను కల్పించి.. తెలంగాణ ప్రభుత్వం మనసున్న సర్కారుగా నగరవాసుల్లో చెరగని ముద్ర వేసుకుంది. కోట్ల రూపాయలు వెచ్చించి వైభవంగా వేడుకలు నిర్వహించుకునేలా మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు.. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఓపెన్ జిమ్‌లు.. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సకల సదుపాయాలతో వ్యాపారులకు మేలు జరిగేలా మోడల్ మార్కెట్లు, క్రీడాకారులకు ఉపయోగపడేలా ఆట మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు వంటివి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ తొమ్మిదిన్నరేండ్లలో ఊహించని అభివృద్ధి గ్రేటర్‌లో జరిగిందని నగరవాసులు ప్రశంసిస్తున్నారు.

- సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ)

- తొమ్మిదిన్నరేండ్లలో ఊహించని అభివృద్ధి
- మౌలిక వసతుల కల్పనలో ఆదర్శంగా మహానగరం
- పేదలు, సామాన్యుల కోసం అత్యాధునిక సదుపాయాలు
- మనసున్న సర్కారుగా నగరవాసుల్లో చెరగని ముద్ర
- 38 మోడల్ మార్కెట్లు.. 270 జిమ్ సెంటర్లు
- 9 మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లు ఇప్పటికే అందుబాటులోకి..



మేడిపల్లిలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్..

## రూ. 90 కోట్లతో 31 చోట్ల
## మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు

హైదరాబాద్ నగరంలో సామాన్యులు పెళ్లి, ఇతర వేడుకలు చేయడమంటే సులువు కాదు..ఖర్చు తడిసి మోపడవుతున్నది. ఇంటి వద్ద దావత్ చేద్దామంటే ఉన్న వీధులు ఇరుగ్గా ఉంటాయి. ఏదైనా ఫంక్షన్ హాల్ బుక్ చేద్దామంటే తక్కువలో తక్కువ రూ. 60 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఉంటుంది. వంట సామగ్రి, డెకరేషన్, ఇతరత్రా కలిపి మరో రూ. 50వేలు దాటుతుంది. ఈ నేపథ్యంలోనే ఫంక్షన్ హాళ్ల అద్దెలు భరించలేని మధ్య, దిగువ తరగతి, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రూ. 90 కోట్లతో 31 చోట్ల మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లను నిర్మించాలని భావించి ఈ మేరకు విడతల వారీగా పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే ఇప్పటి వరకు రూ. 30.10కోట్లతో తొమ్మిది చోట్ల మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అందుబాటులోకి వచ్చిన బహుళ వినియోగ ఫంక్షన్‌హాళ్లు వందలాది మందికి ఎంతో ప్రయోజనం చేకూరుతున్నాయి. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ రూ. 64.98 కోట్లతో మరో 15 చోట్ల మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లను శ్రీకారం చుట్టగా, విడతల వారీగా వీటిని అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



బన్సీలాల్‌పేటలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్

### రూ.30.10కోట్లతో అందుబాటులోకి వచ్చిన 9 ఫంక్షన్ హాళ్లు ఇవే..

| ప్రాంతం | ఖర్చు చేసినవి (రూ. కోట్లలో) |
|---|---|
| రామంతాపూర్ గాంధీనగర్ | 2.87 |
| చంపాపేట, న్యూ గాంధీ విగ్రహం | 2.63 |
| చైతన్యనగర్, పటాన్‌చెరు | 2.87 |
| కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4 | 3.22 |
| గాజులరామారం, భరత్‌సింగ్ నగర్ | 3.34 |
| సీతాఫల్‌మండి టీఆర్‌టీ క్వార్టర్స్ దగ్గర | 3.72 |
| బోయిగూడ పోలీస్‌స్టేషన్ దగ్గర బన్సీలాల్ పేట | 2.61 |
| మారేడ్‌పల్లి, నెహ్రూనగర్ పార్క్ పక్కన | 2.47 |
| కూకట్‌పల్లి వెస్ట్రన్ హిల్స్ | 6.34 |

### మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల ప్రత్యేకతలు

- ఫంక్షన్ హాళ్లను దాదాపు 2 వేల చ.గ.ల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు.
- మూడంతస్తులుగా నిర్మాణం.
- ఒక అంతస్తులో వివాహాలు వంటి శుభకార్యాలు, ఒక అంతస్తులో ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించేలా ఏర్పాట్లు.
- మరో అంతస్తులో భోజనాలకు ఏర్పాట్లు. సెల్లార్‌లో పార్కింగ్ సదుపాయం.
- వివాహాలకు కనీసం వెయ్యి మంది కూర్చునేలా ఏర్పాట్లు.

### చెల్లించాల్సిన అద్దె..

- జీహెచ్ఎంసీ నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ అద్దె కేవలం రూ.27,500 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అది కూడా వ్యక్తులకు కాకుండా 'జీహెచ్ఎంసీ, కమిషనర్' పేరుతో జాతీయ బ్యాంకు నుంచి డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకుని, స్థానిక జీహెచ్ఎంసీ సర్కిల్ రెంట్ కంట్రోల్ అధికారికి అందజేసి, రశీదు తీసుకోవాలి.

### అత్యాధునిక హంగులతో..

లక్షలు పోసిన ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో లభించని సేవలు ప్రభుత్వం నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లలో లభిస్తున్నాయి. కేవలం రూ. 27, 500లతో ఒకేసారి రెండు వేల మందితో వేడుక నిర్వహించేలా సౌలభ్యంతో నిర్మించారు. కండ్లు మిరుమిట్లు గొలిపే, జూమర్ లైట్లు, అద్దంలాంటి ఫ్లోరింగ్, సామగ్రితో కూడిన వంటగది, వివాహ వేడుకల కోసం వధువరులను ముస్తాబు చేసేందుకు ప్రత్యేక గదులు, బంధుమిత్రులకు విడిది వసతి, సురక్షిత తాగునీరు ఇలా సకల సౌకర్యాలతో ఈ ఫంక్షన్ హాళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే పెండ్లిండ్ల సీజన్‌లో ఒక్కో ఫంక్షన్ హాళ్లలో నెలకు 15 నుంచి 20 ఫంక్షన్లు జరుగుతున్నాయి. ఇతర సమయాల్లో నెలకు 4 లేదా 5 వరకు మాత్రమే ఫంక్షన్లు జరుగుతున్నాయని, సామాన్యులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని అధికారులు తెలిపారు. వేడుకలు లేని సందర్భంగా ఈ ఫంక్షన్‌హాళ్లు బతుకమ్మ చీరల పంపిణీ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు, వైద్య శిబిరాలు, యువతకు ఉపాధి అవకాశాల అవగాహన శిబిరాలు, రక్తదాన శిబిరాలకు వేదికగా నిలుస్తున్నాయి.



సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్



భగత్‌సింగ్ నగర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్

**గ్రేటర్‌లో 521 ఆట మైదానాలు, 26 స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, 13 స్విమ్మింగ్‌పూల్స్, 5 టెన్నిస్ కోర్ట్స్, 11 స్కేటింగ్ రింక్స్ అందుబాటులో ఉన్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్, ఎక్సర్‌సైజ్ బార్ సింగల్ క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్నారు. సుమారు 1.50 లక్షల మంది ప్రతి నెలా ఈ ఆట మైదానాల్ని ఉపయోగిస్తున్నారు.**

### ఆరోగ్యాన్నిచ్చే ఓపెన్ జిమ్‌లు..

నగరవాసులు ఆరోగ్యాన్ని కాపాడుకునేలా జీహెచ్ఎంసీ ఓపెన్ జిమ్‌లకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నది. నెలకు వేలల్లో ఫీజులు చెల్లించి దేహదారుఢ్యాన్ని మలుచుకునే పరిస్థితికి దూరంగా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా బల్దియా ముఖ్యమైన పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వివిధ కమ్యూనిటీ హాళ్లు, సంక్షేమ సంఘాల్లో 135 ఆధునిక జిమ్‌లు/ఫిట్‌నెస్ కేంద్రాలు ఉండగా, బహిరంగ ప్రదేశాల్లో 135 చోట్ల ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. జోనల్ స్థాయిలో వీటి నిర్వహణ జరుగుతున్నది. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ఆధునిక జిమ్‌లు, ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలో 270 జిమ్ సెంటర్లు ఉన్నాయని, రాబోయే రోజుల్లో వీటి సంఖ్యను మరింత పెంచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### రోజంతా హుషారుగా..

- జీహెచ్ఎంసీ పార్కుల్లో ఏర్పాటు చేస్తున్న ఔట్‌డోర్ జిమ్‌లో అత్యాధునిక వ్యాయామ పరికరాలు ఉంటున్నాయి. ఎయిర్‌వాకర్, ఎయిర్ స్వింగ్, షోల్డర్ వీల్, లెగ్‌ప్రెస్, పుల్‌చైర్, స్టాండింగ్ ట్విస్టర్, డబుల్ క్రాస్ వాకర్, ఎల్లిప్టికర్ ఎక్సర్‌సైజ్, లెగ్‌లిఫ్ట్, సిట్టింగ్ ట్విస్టర్ ఉంటున్నాయి.
- వాకింగ్ వచ్చిన వారు కాసేపు వ్యాయామం చేసిన తర్వాతే ఇండ్లకు వెళ్తున్నారు.
- ఈ ఓపెన్ జిమ్‌ల పట్ల యువత, చిన్నారులు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు ఆసక్తి చూపుతున్నారు.
- వేలకు వేలు పోసి ప్రైవేట్ జిమ్‌లకు వెళ్లే కంటే జీహెచ్ఎంసీ అందుబాటులోకి తీసుకొచ్చిన ఓపెన్ జిమ్‌లు బెటర్ అని అంటున్నారు.
- ఓపెన్ జిమ్‌తో ఎంతో ఉత్సాహంగా ఉందని, రోజంతా పనిచేసినా హుషారుగా ఉంటున్నామని స్థానికులు చెబుతున్నారు.

### జీహెచ్ఎంసీ పరిధిలో జిమ్‌ల వివరాలు (జోన్ల వారీగా)..

| జోన్ | ఓపెన్ జిమ్‌లు | మోడ్రన్ జిమ్/ ఫిట్‌నెస్ సెంటర్స్ |
|---|---|---|
| ఎల్బీనగర్ | 23 | 23 |
| చార్మినార్ | 18 | 29 |
| ఖైరతాబాద్ | 30 | 25 |
| శేరిలింగంపల్లి | 21 | 15 |
| కూకట్‌పల్లి | 32 | 20 |
| సికింద్రాబాద్ | 11 | 23 |
| | 135 | 135 |






### ఆధునిక మార్కెట్లు

గ్రేటర్‌లో ప్రతి పది వేల మంది జనాభాకు మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నది. కూరగాయలు, మాంసాహారం ఒకే ప్రదేశంలో లభ్యమయ్యే విధంగా పాత మార్కెట్ స్థలాల్లో నూతనంగా మోడల్ మార్కెట్ల నిర్మాణాలను చేపడుతున్నది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 8 మార్కెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మరో ఎనిమిది చోట్ల పనులు చేపట్టారు. మొత్తంగా ఇప్పటి వరకు రూ.19.38 కోట్లు ఖర్చు పెట్టి 38 మోడల్ మార్కెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ. 63.90 కోట్లతో నాలుగు చోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. రూ.4 కోట్లతో నారాయణగూడ ఓల్డ్ మున్సిపల్ వెజిటేబుల్ మార్కెట్ వద్ద మోడల్ మార్కెట్ అందుబాటులోకి రానున్నాయి. చిక్కడపల్లిలో రూ.40 కోట్లతో చేపట్టారు. దీంతో పాటు అమీర్‌పేట, పంజాగుట్ట మోడల్ మార్కెట్లు పురోగతిలో ఉన్నాయి. రూ. 19.40 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఐదు ఫిష్ మార్కెట్లకు శ్రీకారం చుట్టిన అధికారులు.. ఇప్పటికే నాచారం, కూకట్‌పల్లి మార్కెట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. కాగా, మోడల్ మార్కెట్లు అందుబాటులోకి రావడంతో ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, శుభ్రమైన మాంసాహారం, చేపలు లభించడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడినట్లయింది. గతంలో నగరంలో రోడ్లపై అమ్మడం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఎదురవుతున్న పరిస్థితి. తద్వారా రవాణాకు ఆటంకం కలుగుతున్నది. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని నగరంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్దేశిత ప్రదేశాలను గుర్తించి ఈ మోడల్ మార్కెట్ల నిర్మాణాలపై జీహెచ్ఎంసీ దృష్టి సారించి చర్యలు చేపడుతున్నది.

